పీయూ విద్యార్థినిపై కత్తెరతో దాడి

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా మూడబిద్రిలో ని ఆళ్వాస్ కళాశాలలో పీయూ విద్యార్థినిపై ఓ యువకుడు కత్తెరతో దాడి చేసి న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కళాశాలకు చెందిన విద్యార్థినిపై తుమకూరుకు చెందిన మంజునాథ్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. ప్రేమిస్తున్నానని కొంతకాలంగా మంజునాథ్ వెంటపడ్డాడు. విద్యార్థిని ప్రేమను అంగీకరించకపోవడంతో కత్తెరతో కడుపులో తీవ్రంగా పొడిచాడు. గాయపడిన విద్యార్థిని ఆ సుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి మంజునాథ్‌ను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.



డ్యాం వద్ద పర్యటిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

జలాశయాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



చురుగ్గా గేటు ఏర్పాటు పనులు

- ఐదు భాగాలుగా విడగొట్టి క్రస్ట్ గేటు తయారీ
- ఏపీ సీఎం చంద్రబాబు చొరవతో కన్నయ్యనాయుడు మకాం
- సీఎం సిద్ధరామయ్యతో కలిసి ఏపీ మంత్రులు పయ్యావుల, నిమ్మల సందర్శన

బళ్లారి/రాయదుర్గం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేట్ స్థానంలో తాత్కాలిక స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలు అక్కడే మకాం వేసి పనులను వేగవంతంగా సాగేలా పర్యవేక్షిస్తున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం డ్యాంను మంగళవారం పరిశీలించారు. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ వద్ద పరిశీలించి అధికారులతో సమీక్షించారు. బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఈఈలు, డీఈలతో సమీక్షలు నిర్వహించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో జలాశయాల క్రస్ట్‌గేట్ల నిర్మాణంలో విశేష అనుభవమున్న కన్నయ్యనాయుడును పిలిపించి ఆయన సారథ్యంలో తాత్కాలిక క్రస్ట్‌గేట్ పనులు జరిగేలా చూశారు. 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తున ఉండాల్సిన క్రస్ట్‌గేట్‌ను ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో దింపేందుకు సాధ్యపడదని అంచనాకు వచ్చి వాటిని ఐదు భాగాలుగా విడగొట్టారు. ఆ పనులను ఐదు కంపెనీలకు అప్పగించారు. 60 అడుగుల వెడల్పుతో నాలుగు అడుగుల ఎత్తున ఉండేలా షట్టర్లను తయారు చేయిస్తున్నారు. మరో మూడురోజుల్లో షట్టర్ల తయారీ ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఒక్కో షట్టర్‌ను ప్రవహిస్తున్న నీటిలో దింపి, ప్రవాహానికి అడ్డుకట్ట వేయనున్నట్లు వెల్లడించారు. వీటి కోసం అవసరమైన పెద్ద క్రేన్లను ఏర్పాటు చేసే బాధ్యతను జేఎస్‌డబ్ల్యు కంపెనీకి అప్పగించారు. బుధవారం ఉదయానికల్లా అవి చేరుకోనున్నట్లు తెలిపారు. జలాశయం వద్దకు సందర్శకులను అనుమతిని నిరాకరించారు. పోలీసులు పెద్ద ఎత్తున మొహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు.



గేటు తయారు చేస్తున్న కార్మికులు

సాయంత్రం దాకా పర్యటించిన ఏపీ మంత్రులు

జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం రాత్రికి తుంగభద్ర జలాశయం వద్దకు చేరుకుని అక్కడే మకాం వేశారు. మంగళవారం ఉదయాన్నే ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకుని సాయంత్రం వరకు ఉండి పనులను పరిశీలించారు. అధికారులతో చిత్రపటాలను తెప్పించుకుని చేస్తున్న పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక, సాంకేతిక పరమైన సహకారాన్ని పూర్తిగా అందిస్తామని బోర్డుకు హామీ ఇచ్చారు. దీనిపై ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించి ఇక్కడే ఉండేలా చూస్తున్నామని వివరించారు. ప్రధానంగా బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డితో పాటు ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డితో ఏకాంతంగా చర్చించి గేట్ కొట్టుకుపోవడానికి గల కారణాలు, వైఫల్యం గురించి సమీక్షించారు. అనంతరం జలాశయం వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి నీటి నిల్వ పరిస్థితిని వీక్షించారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయిస్తాం: సీఎం

జలాశయం వద్దకు మంగళవారం చేరుకున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు సమన్వయంగా ముందుకెళ్లి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. క్రస్ట్‌గేట్ ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ అధికారులు సీడబ్ల్యూసీ ఆదేశాల ప్రకారం కన్నయ్యనాయుడు పనులు చేయిస్తున్నారని తెలిపారు. జలాశయంలో నీరు ఖాళీ అయినప్పటికీ మరిన్ని వర్షాలు కురిసి పనులు పూర్తి అయిన అనంతరం మళ్లీ జలాశయం నిండు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర, కర్ణాటకకు సంబంధించి తాగు, సాగుకు ఉపయోగపడే ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడం దురదృష్టకరమన్నారు. పనులను వీలైనంత తొందరలో పూర్తి చేసి నీటిని నిల్వ చేసేందుకు ఇంజనీరింగ్ బృందాలు కష్టపడుతున్నాయని తెలిపారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. పనుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు.



19వ గేట్ ఊడిపోయిన ప్రాంతం



మాజీమంత్రి శ్రీరాములుతో మాట్లాడుతున్న ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు



మాట్లాడుతున్న కన్నయ్యనాయుడు



మీడియాతో సీఎం సిద్దరామయ్య, ఏపీ మంత్రులు

ఇన్‌ఫ్లో గురించి ఆరా

ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీరు నదికి వృథాగా వెళుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఇన్‌ఫ్లో పరిస్థితుల గురించి అధికారులతో ఏపీ మంత్రులు ఆరా తీశారు. పదేళ్లుగా ఆగస్టు మాసం చివర్లో ఏ మేరకు ఇన్‌ఫ్లో ఉందో అడిగి తెలుసుకున్నారు. 60 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి క్రస్ట్‌గేట్ ఏర్పాటు పనులు పూర్తయితే అనంతరం ఎగువన వర్షాలు కురిసి నీరు చేరే అవకాశాలపై ఆరా తీశారు. సెప్టెంబరు మాసంలో కూడా వర్షాలు ఉంటాయని అంచనా వేశారు. ప్రస్తుతం కాలువల కింద పంటల సాగులో ఉండి లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెడుతున్న రైతాంగం నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


మైసూరు ఉత్సవాలకు 14 గజరాజులు

- అంబారీ కెప్టెన్‌గా మళ్లీ 'అభిమన్యు'



జాబితాను ప్రకటిస్తున్న మంత్రి ఈశ్వర్‌ఖండ్రె

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాల్లో కీలక ఘట్టమైన జంబూసవారీలో పాల్గొనే గజరాజుల జాబితా ప్రకటించారు. అంబారీ మోసేందుకు 'అభిమన్యు'ను ఖరారు చేశారు. అభిమన్యు సారథ్యంలోనే దసరా ఉత్సవాలు కొనసాగనున్నాయి. అక్టోబరు 3నుంచి 12వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు మైసూరులో సోమవారం గజరాజుల జాబితాను అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ప్రకటించారు. ఈ నెల 21న హుణసూరు తాలూకా వీరనహొసహళ్లిలో ఏనుగులకు పూజలు చేసి గజపయనానికి శ్రీకారం చుడతారు. అభిమన్యుతో పాటు మహేంద్ర, గోపి, భీమ, ప్రశాంత, ధనంజయ, సుగ్రీవ, హిరణ్య, రోహిత, ఏకలవ్యకంజన్, లక్ష్మి, వరలక్ష్మి, దొడ్డహరవే, లక్ష్మి ఏనుగులు పాల్గొననున్నాయి. తొలి విడతలో 9, రెండో విడతలో 5 ఏనుగులు మైసూరుకు చేరుకోనున్నాయి. గజరాజుల జాబితా ప్రకటించేవేళ మంత్రితోపాటు అధికారులు 'అర్జున'ను స్మరించుకున్నారు. దసరా ఉత్సవాల్లో 8సార్లు నాడదేవత చాముండేశ్వరి దేవి అంబారీ మోసిన అర్జున డిసెంబరు 4న అడవి ఏనుగుల కార్యాచరణ వేళ మృతి చెందిన విషయం తెలిసిందే.



అభిమన్యు (ఫైల్)

అధిష్ఠానం అనుమతితో ఎవరైనా పాదయాత్ర చేయొచ్చు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కూడల సంగమ నుంచి బళ్లారి దాకా ప్రత్యేక పాదయాత్ర చేస్తే తనకు అభ్యంతరం లేదని, అధిష్ఠానం అనుమతితో ఎవరైనా పాదయాత్ర చేయొచ్చని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర స్పష్టం చేశారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీకి చెందిన కొందరు ముఖ్యులు బెళగావిలో రహస్య సమావేశం నిర్వహించడంపై స్పందించారు. కొందరు ప్రత్యేక పాదయాత్ర చేయాలని భావిస్తున్నారని, పార్టీకి శక్తి లభించేలా ఉంటే అధిష్ఠానం పెద్దలు అనుమతిస్తారని, ఈ విషయంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. ఢిల్లీ నేతలను కలుస్తామని ప్రకటించారని, పార్టీ ముఖ్యులతో భేటీ అయ్యేందుకు వారు స్వతంత్రులని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అందరినీ కలుపుకొనిపోయే ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. సీపీ యోగేశ్వర్ ఢిల్లీ వెళ్లిన విషయమై స్పందిస్తూ ఆయన చెన్నపట్టణ అభ్యర్థి కావాలని ప్రచారం చేసుకున్నారని తెలిపారు. అది తప్పు అని చెప్పలేనని అన్నారు. నియోజకవర్గంలో ఆయనకు పట్టు ఉందన్నారు. బీజేపీ-జేడీఎస్ కలసి రాజకీయాలు చేస్తున్నందున అభ్యర్థి విషయంలో సమష్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పైగా కుమారస్వామి విజయం సాధించిన నియోజకవర్గం అన్నారు. ఎవరికి టిక్కెట్ ఇవ్వాలనేది అగ్రనేతలు నిర్ణయిస్తారని తెలిపారు. పార్టీ నేతలు మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ నేతృత్వంలోని కమిటీ అభిప్రాయం తీసుకున్నారని వివరించారు. ఎమ్మెల్యే బీపీ హరీశ్ రోజుకోమాట మాట్లాడతారని, అతడిలా దిగజారలేనని అన్నారు.



ప్రాజెక్టుల స్థితిగతులపై అధ్యయనం




- నిపుణుల కమిటీ ఏర్పాటు
- నివేదిక ఆధారంగా చర్యలు
- డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేట్ చెయిన్‌లింక్ తెగిపోవడంతో లక్షలాది క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ప్రాజెక్టు నిర్మించిన 70 ఏళ్ల తర్వాత సమస్య నెలకొంది. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిర్మాణాలు జరిగి 50-70ఏళ్లు పైబడ్డాయి. దీంతో అన్ని ప్రాజెక్టుల పరిశీలనకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమగ్ర అధ్యయనం చేసి మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టేలా తీర్మానించింది. రాష్ట్ర జలవనరులశాఖ, విద్యుత్‌శాఖ పరిధిలో 200కు పైగా ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో వంద జలాశయాలు ప్రముఖమైనవి కాగా మిగిలినవి మినీ ప్రాజెక్టులుగా ఉన్నాయి. వీటిలో 50-100 ఏళ్లు పూర్తయిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. తుంగభద్ర జలాశయం ఘటనతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగిన చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టులో క్రస్ట్‌గేట్ చెయిన్‌లింక్ తెగిపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందన్నారు. జలవనరుల నిపుణులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నివేదిక సిద్ధం చేయాలని కోరతామని అన్నారు. కమిటీ నెల రోజుల వ్యవధిలో అన్ని ప్రాజెక్టుల స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వనుందన్నారు. కబిని, భద్ర జలాశయాలలోనూ నీటి లీకేజీ అంశాన్ని గుర్తు చేశారు. అన్ని ప్రాజెక్టులను పరిశీలించి నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వగానే చర్యలు చేపడతామని తెలిపారు. రాష్ట్రంలోని 12 ప్రముఖమైన జలాశయాలలో 90శాతానికి పైగా భర్తీ అయ్యాయి. నీటిమట్టం 95శాతానికి పైగానే ఉంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కొనసాగుతాయనే వాతావరణ పరిశోధనశాఖ హెచ్చరిస్తుండడంతో వరద ముప్పు బెంబేలెత్తిస్తోంది. సోమవారం నాటికి ప్రాజెక్టుల నీటిమట్టం ఇలా ఉంది.

ప్రాజెక్టులు	గరిష్ఠం (అ)	ప్రస్తుతం (అ)
ఘటప్రభ	2175	2174.95
మలప్రభ	2079.50	2077
లింగనమక్కి	1819	1816.65
భద్ర	186	180.3
కేఆర్ఎస్	124.80	123.10
కబిని	2284	2282.77
హారంగి	2859	2856.87
హేమావతి	2922	2920.80
తుంగభద్ర	1633	1630
మాని	594.36 మీ	588 మీ
ఆల్మట్టి	519.60 మీ	519.32 మీ
సూపా	564 మీ	558.50 మీ

భారీ వర్షాలపై నేడు సీఎం సమీక్ష

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల మూడోవారంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధనశాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య వివిధశాఖల అధికారులతో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి బెంగళూరులో నాలుగు గంటల వ్యవధిలో 7 సెంటిమీటర్ల వర్షం కురవడంతో నగరమంతటా ప్రధాన రహదారులు జలమయమై అతలాకుతలమైంది. ఈనెల 13 నుంచి 17వరకు యెల్లో అలర్ట్, 15న ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. మరోవైపు దక్షిణతీరం, పశ్చిమ కనుమలు, తీర ప్రాంతాల్లో ఇప్పటికే సాధారణం కంటే 26శాతం ఎక్కువ వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలలుగా వర్షాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 80వేల హెక్టార్లలో పంట దెబ్బతిన్నది. 1126 ఇళ్లు నేలకూలగా, 1176 ఇళ్లకు తీరని నష్టం కలిగింది. మరో వారంరోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయనే సంకేతాలు ఉండడంతో ముందస్తు చర్యలు తీసుకునేందుకు సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరగనుందని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విధానసౌధలో మీడియాకు వివరించారు. బెంగళూరు నగరంతోపాటు వివిధ జిల్లాల అధికారులు సమీక్షలో పాల్గొంటారన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.97	1,628.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	25,571	12,560
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	99,567	11,392
సామర్థ్యం (టీఎంసీలు)	95.75	89.26

అలరించిన సాంస్కృతిక కార్యక్రమం



సాంస్కృతిక కార్యక్రమంలో ఓ నృత్య సన్నివేశం

బళ్లారి సిటీ, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా సోమవారం సాయంత్రం సాంస్కృతిక సముదాయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ప్రజల్లో దేశభక్తిని పెంపొందించింది. నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని కల్చరల్ కాంప్లెక్స్ ఆవరణలో నాడోజసుభద్రమ్మ మన్సూర్ బయలు రంగమందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ అలరించింది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలు ఆలపిస్తూ సంగీతానికి తగ్గట్టుగా డ్యాన్స్ చేశారు. బళ్లారికి చెందిన మూన్ వాకర్స్ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వారు దేశభక్తి గీతాలకు నృత్యం చేయడంతో వృద్ధులు ,యువకులు తేడా లేకుండా అందరూ దేశభక్తిలో మునిగిపోయారు. అనంతరం బళ్లారి తాలూకా శంకరబండె గ్రామానికి చెందిన హొన్నూర్‌సాబ్ బృందం రామాయణ సన్నివేశాలను ప్రేక్షకుల ముందుంచారు. ఈసందర్భంగా డిప్యూటీ కమిషనర్ మహ్మద్ జుబేరా, కన్నడ సాంస్కృతిక శాఖ నాగరాజు, అధికారులు, శాఖ సిబ్బంది, నగరవాసులు సాంస్కృతిక అందాలను తిలకించారు.

డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు వీడ్కోలు



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రుద్రప్ప

బళ్లారి సిటీ, ఆగస్టు 13: నగరంలోని ప్రతిష్ఠిత కళాశాలలో ఒకటైన ఎస్‌జీటీ కళాశాలలో మంగళవారం బికాం, బిబిఏ విద్యార్థులకు వీడ్కోలు సమారంభం ఘనంగా సాగింది. ఎస్‌జీటీ కళాశాల అధ్యక్షులు రుద్రప్ప మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు సాధించిన విజయాలు తమకు గర్వకారణమన్నారు తమ కళాశాల ఇప్పటి వరకు 183ర్యాంకులు సాధించిందన్నారు. దాదాపు 30కిపైగా విద్యార్థులు ఫస్ట్ ర్యాంకు సాధించి బంగారు పతకాలను సాధించారని, ర్యాంకులు సాధించిన విద్యార్థులందరినీ ఆయన అభినందించారు. ఇదే సందర్భంగా ఎస్‌జీటీ కళాశాల అధ్యాపకురాలు బీబీఏ విభాగాధిపతి రీనాకు 2023-24 సంవత్సరానికి గాను గౌరవ డాక్టరేట్‌ను అందజేసి సత్కరించారు. అవార్డును స్వీకరించిన రీనా ఆర్ మాట్లాడుతూ తనకు గౌరవ డాక్టరేట్ పొందేందుకు సహకరించిన ప్రిన్సిపాల్ రుద్రప్పకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన ఆశీస్సులు కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీటీ ఇనిస్టిట్యూట్ ట్రెజరర్లు, స్కూల్ డైరెక్టర్ మంజుల, ఎస్‌జీటీ విభాగాధిపతులు పాల్గొన్నారు. తదనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వేడుకలకు సిద్ధమవుతున్న కార్యాలయాలు



కంప్లి పురసభ వద్ద స్తంభాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

కంప్లి, ఆగస్టు 13 : ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేస్తున్నారు. పట్టణంలో జెండాల వ్యాపారం కూడా జోరుగా కొనసాగుతోంది. కంప్లి పురసభ ప్రాంగణంలో జాతీయ జెండా ఎగురవేసేందుకు ముస్తాబు చేపడుతున్నారు. జెండా ఎగురవేత అనంతరం శ్యామియా చంద్ పాఠశాలలో ఏర్పాటయ్యే కార్యక్రమంలో పాల్గొని స్వాతంత్ర్య వేడుకలను చేసుకునేందుకు సిద్ధమయ్యారు.

టీబీడ్యాం గేట్ తయారీలో వర్కర్లు బిజీ..బిజీ!



తుంగభద్ర డ్యాంకు పాతగేటు స్థానంలో కొత్తగేటు ఏర్పాటు చేయడానికి గత రెండు రోజులుగా రెండు కంపెనీల్లో 60మంది కార్మికులు శ్రమిస్తున్నారు. జలాశయం వరద తాకిడికి కొట్టుకుని పోయిన గేటు స్థానంలో 20అడుగులు ఎత్తు, 60 అడుగుల వెడల్పు ఉండేలా కొత్తగేటుకు అధికారులు డిజైన్ రూపొందించారు. ప్రస్తుతం



హొసపేటలోని నారాయణ ఇంజనీరింగ్ కంపెనీ తాత్కాలిక గేటు నిర్మాణం పనులను చేస్తుండగా, హిందుస్థాన్ ఇంజనీరింగ్ కంపెనీ కొప్పళ తాలూకా హొసళ్ళి షెడ్‌లో గేటుకు సంబంధించిన పరికరాల తయారీలో నిమగ్నమైంది. గేట్ నిర్మాణ పనులను డ్యామ్ మండలి ఇంజనీయర్ సుధాకర్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

డ్యామ్‌ను పరిశీలించిన సీపీఐ బృందం

కంప్లి, ఆగస్టు 13: తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్ గేటు తెగిపోవడంతో జలాశయంలో నీరు వృథా అవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున తదితరులతో కలిసి ఆయన జలాశయాన్ని మంగళవారం పరిశీలించారు. జలాశయం కింద కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ పరిధిలో 12 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సరిపడా నీరు ఈ ఏడాది ఆగస్టుకు ముందే నిల్వ ఉండటంతో రైతులు సంతోషించారని అన్నారు. ఖరీఫ్ పంటల సాగు ప్రారంభిస్తున్న తరుణంలో గేటు తెగిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జలాశయంలో 65 శాతం కర్ణాటక, 35 శాతం ఆంధ్ర, తెలంగాణ భాగస్వామ్యం ఉందని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. అప్పటి ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, కేంద్రంలో ప్రధాని మోదీ తుంగభద్ర జలాశయం అభివృద్ధిపై దృష్టి సారించలేదని విమర్శించారు. ప్రతి ఏటా గేట్లను పరిశీలించి, భద్రతా చర్యలు చేపట్టివుంటే ఇలాంటి సమస్య ఉండేది కాదని అన్నారు. త్వరితగతిన గేటును పునరుద్ధరించి, ఖరీఫ్ పంటల సాగుకు ఇబ్బంది లేకుండా చూడాలని డ్యాం పరిశీలనకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు.



మంత్రి రామానాయుడుకు సమస్యను వివరిస్తున్న సీపీఐ నేతలు

తగ్గని తుంగభద్ర వరద పోటు

కంప్లి, ఆగస్టు 13 : టీబీడ్యాం నుంచి సుమారు ఒక లక్ష క్యూసెక్కుల నీరు నదికి రావడంతో నదికి మరలా వరద పోటెత్తింది. దీంతో తాము పూర్తిగా ఇబ్బందులకు గురయ్యామని రైతన్నలు వాపోతున్నారు. రైతు సంఘం నాయకులు బీవీ గౌడ మాట్లాడుతూ తుంగభద్ర తీరాన నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకుని వారిని నష్టపరిహారం అందించాలన్నారు. ఈ యేడాది సకాలంలో వర్షాలు కురిసి పుష్కలంగా పంటలు వేసుకునేందుకు రైతన్నలు ముందుకొచ్చారని, కానీ ఉన్నపళంగా ఇలా గేటు తెగిపోవడంతో రైతులకు ఖరీఫ్ పంటకు నీరందుతుందో, లేదోనన్న సందిగ్ధంలో వున్నారన్నారు. కంప్లి పరిధిలోని బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, గ్రామాల్లో నది ఒడ్డున వుండే గ్రామాల రైతన్నలు పూర్తిగా నష్టపోయారన్నారు. వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు ఇతర పంటలు పూర్తిగా నష్టపోయాయని, వెంటనే రెవెన్యూ శాఖ పరిశీలించి రైతులకు హెక్టారుకు రూ. 50 వేలు పైగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కంప్లి కోట వద్ద తగ్గుగా వున్న వంతెనను ఎత్తులో నిర్మించి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూడాలని కోరారు.



కంప్లి వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న నీరు

మహానుభావుల ఆదర్శాలను పాటించాలి

● ఏడీసీ మహ్మద్ జుబేరా పిలుపు ● హర్‌ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా కొండ ఎక్కిన విద్యార్థులు

బళ్లారి సిటీ, ఆగస్టు 13: నేటి యువతరానికి చెందిన మహనీయుల విలువలను, ఆదర్శాలను తమ జీవితంలో పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మంగళవారం కొండ ఎక్కి నగరంలోని చారిత్రక బళ్లారి కోటపై జిల్లాయంత్రాంగం తరఫున జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల విలువను అలవర్చుకోవాలన్నారు. దేశంపై ప్రేమను పెంపొందించు కోవాలన్నారు. ప్రతి విద్యార్థి కొండ



ఏకశిల కొండపై జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



బళ్లారి ఏకశిల కొండను ఎక్కుతున్న విద్యార్థులు, అధికారులు

పైకి ఎక్కి జాతీయ జెండాను ఎగురవేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. బళ్లారిలోని చారిత్రాత్మకమైన ఏకశిల కొండపై జాతీయ జెండాను ఎగురవేయడం దేశభక్తి పెరగడానికి దోహదపడుతుందన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పర్వతారోహణ చేసే ముందు విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేశారు. ఎట్టకేలకు కొండపైకెక్కి మువ్వన్నెల జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కొండ ఎక్కే కార్యక్రమంలో 600 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మల్లికార్జున, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జలాలప్ప, జిల్లా స్థాయి అధికారులు, హాస్టల్ సంరక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండవేడిమి దెబ్బకు నెత్తికెక్కిన కుర్చీలు



నెత్తిన కుర్చీలతో ప్రముఖుల రాకకోసం ఎదురు చూస్తున్న విలేకరులు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 13: తుంగభద్ర జలాశయం 19వ గేటు కొట్టుకుని పోయినప్పటి నుంచి అధికారులతో పాటు వివిధ పత్రికల విలేకరులు ఎప్పటికప్పుడు తాజా వార్తలు అందించాలనే ఉద్దేశ్యంతో రాత్రింబగళ్లు తుంగభద్ర జలాశయం వద్దనే మకాం చేస్తున్నారు. ఒకవైపు తుంగభద్ర క్రస్ట్‌గేట్ విషయంపై వార్తలు అందించే ఒత్తిడి ఉండగా, మరోవైపు నెత్తిన 35డిగ్రీల సూర్యుడి ప్రతాపం వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. గత మూడు రోజులుగా వివిపిల రాకతో నిండిపోయిన తుంగభద్రడ్యామ్ పరిసరాలు ఉత్కంఠరేపుతున్నాయి. మంగళవారం ఒకే రోజు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన మంత్రులు, కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాకతో డ్యామ్ పరిసరాలు హడాహుడిని సంతరించుకున్నాయి. న్యూస్ కవరేజ్ కోసం వచ్చిన విలేకరులకు 22వ గేటు వద్ద కుర్చీలు ఏర్పాటుచేశారు. అయితే అక్కడ ఎక్కడా నీడ లేకపోవడంతో ఆ కుర్చీలనే తలపై పెట్టుకుని ప్రముఖుల రాకకోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



వరలక్ష్మీ సహకార సంఘం వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షులు జగదీష్

కంప్లి, ఆగస్టు 13 : గ్రామాలు, పట్టణాలలో సహకార సంఘ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మెరుగుపడాలని వరలక్ష్మీ క్రెడిట్ సహకార సంఘం అధ్యక్షులు హెచ్ జగదీష్ కోరారు. కంప్లి పట్టణం వీరశైవ సంఘం శారదపాఠశాలలో సహకార సంఘం 22వ వార్షికోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ యేడాది బ్యాంకు రూ. 3,95,36,000 లాభాల్లో వుందన్నారు. ప్రతి ఖాతాదారుడిని తాము దేవుళ్లగా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. వారి వల్లే తమ బ్యాంకు శాఖలను కుడితిని, హగరి బొమ్మనళ్లి, గంగావతి, కొట్టూరు, తోరణగల్లులలో ఏర్పాటు చేస్తామన్నారు. బ్యాంకు ద్వారా వ్యాపారస్తులకు, రైతులకు, వాహనాల లోన్లు తదితర రుణాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొట్రేష్, వీరేశప్ప, కొట్రప్ప, మంజునాథ్, చంద్రశేఖర్, ఉషారాణి, వెంకప్ప, గవిసిద్దప్ప, తదితరులు పాల్గొన్నారు.

దుర్ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



కలెక్టర్ సిబ్బందికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ, ఆగస్టు 13: తుంగభద్ర క్రస్ట్‌గేట్ నిర్మాణంలో దుర్ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఏఐకేకేఎంఎస్ రైతుల జిల్లా కమిటీ మంగళవారం జిల్లాకలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసింది. ఈసందర్భంగా జిల్లాధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం బళ్లారి, కొప్పళ జిల్లాలకు చెందిన లక్షలాది మంది రైతుల జీవనానికి ఆసరాగా నిలుస్తుందన్నారు దీంతో వేలాదిమంది జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో రిజర్వాయర్19వ గేటు కొట్టకుపోయిందన్నారు. ప్రతి సంవత్సరం రిజర్వాయర్‌కు నీరు రాకముందే ప్రతి యూనిట్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తే ఇలాంటి దుర్ఘటనలు జరిగేవి కావన్నారు. ఈ దుర్ఘటన వల్ల జరిగిన ప్రాణనష్టం ,పంటనష్టం సహా ఇతర అన్నిరకాల విపత్తులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మొత్తం నష్టాన్ని భరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుంది. ఈసందర్భంగా గుర్లిరాజ, లింగప్ప, బసవరాజు, మాబుసాబ్, రాందాస్,హనుమంత తదితరులు పాల్గొని జిల్లాకలెక్టర్ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు.

క్రీడాపోటీల్లో విజేతలుగా నిలవాలి



క్రీడాకారులకు సన్మానం చేస్తున్న దృశ్యం

సిరుగుప్ప, ఆగస్టు 13 : రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విజేతలై తాలుకాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యాశాఖాధికారి గురప్ప పిలుపునిచ్చారు. మంగళవారం సిరుగుప్ప ఎన్జీవో కార్యాలయంలో జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికయిన క్రీడాకారులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగరాజురెడ్డి అధ్యక్షతన క్రీడాకారులను పూలమాలలతో సన్మానించారు. ఉద్యోగుల సంఘం కోశాధికారి ఇంజారప్ప, ప్రధాన కార్యదర్శి హనుమంతప్ప పాల్గొన్నారు.

హోసూరు జోన్

క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి



హోసూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు

హోసూరు, ఆగస్టు 13: క్రిమినల్ సవరణ చట్టాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ హోసూరులోని వివిధ ప్రాంతాల్లో ఎల్‌పీఎఫ్, ఐఎన్‌టియూసీ సంఘాల తరఫున సిప్‌కాట్ హోసూరు బస్టాండ్, పాఠశాల బస్టాప్, మత్తిగిరి కూట్రోడు, హోసూరులోని కొత్తకొండపల్లి పాఠశాలల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. దీనికి ఎల్‌పీఎఫ్ జిల్లా మండలి కార్యదర్శి గోపాలకృష్ణన్ అధ్యక్షత వహించారు. ఐఎన్‌టియూసి రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి మునిరాజ్, సిఐటియూ జిల్లా కార్యదర్శి శ్రీధర్, అధ్యక్షుడు వాసుదేవన్, ఐఎన్‌టియూసీ జిల్లా కార్యదర్శి మాదయ్యన్ నాయకత్వం వహించారు. ప్రతిపక్షాలను బహిష్కరించి ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించిన ఈ మూడు క్రూరమైన చట్టాలను ఉపసంహరించుకోవాలని కార్మిక వ్యతిరేక చట్టాల తీర్మానాలను తిరిగి వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలరిచ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పూర్తిగా నిధులు ఇవ్వాలని కోరారు. అంగన్ వాడీ, పిల్లలకు ఆహార ఖర్చులను బట్టి ఖర్చును పెంచాలి. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతోపాటు పలు డిమాండ్లను ప్రజల ముందుంచేందుకు కార్యక్రమం నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎల్‌పీఎఫ్ కార్యనిర్వాహకులు అంగన్‌వాడీ ఎల్‌పీఎఫ్ పద్మమ్మ, చౌకడిపో వెంకటస్వామి, పరశురామన్, శ్రీనివాసప్ప, రాజేశ్, గోవిందరాజ్, రఘు, కుమార్, శక్తివేల్, సంజీవన్, శివకుమార్, ఐఎన్‌టీయూసీ, సెల్వం, అరుళ్ మూర్తి, చెన్నప్ప, సతీష్, తిమ్మరాయప్ప, కమలేష్, పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై అవగాహన

హోసూరు, ఆగస్టు 13: హోసూరులోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన శిబిరం నిర్వహించారు. వరం హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రియదర్శిని ప్రసంగిస్తూ రుతుక్రమ సమస్యలపై అవగాహన కల్పించారు. రుతుక్రమం తప్పడం, టెస్టిక్యూలర్ ట్యూమర్స్, యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ వాటిని ఎలా నివారించాలి, రక్తహీనతకు కారణాలు, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి వివరించారు. కళాశాల రెడ్‌క్రాస్ అధికారి పతిమాకజీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం అధ్యక్షత వహించారు.

వార్డులలో దోమల నియంత్రణకు ఫాగింగ్

హోసూరు, ఆగస్టు 13: హోసూరు కార్పొరేషన్‌లోని 35 వ వార్డు, వీయూసీ నగర్ ఎల్ఐజీ నివాస ప్రాంతం, గాంధీనగర్ ఎంఐజీ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మంగళవారం తనిఖీలు నిర్వహించి దోమల నియంత్రణకు, లార్వాల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పారిశుద్య కాంట్రాక్ట్ కార్మికులు వెళ్లి చెత్తను సేకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేయరాదని, తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. అలాగే వాణిజ్య భవనాలకు ఆస్తిపన్ను విధించారా, దుకాణాలకు వ్యాపార లైసెన్సులు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించారు. పనులు మెరుగుపర్చేందుకు సూచనలు కూడా ఇచ్చారు. మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రాజెక్టు నారాయణన్ అధికారులు పాల్గొన్నారు.



వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మంత్రి డీకే శివకుమార్ పదవి నుంచి తప్పుకోవాలి

● సర్వోదయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ డిమాండ్

రాయచూరు, ఆగస్టు 13 : తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ విరిగిపోయి పెద్ద ఎత్తున రైతులకు నష్టం జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని సర్వోదయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాటాడుతూ, ఘటన జరిగిన వెంటనే డ్యాంను సందర్శించిన మంత్రి డీకే శివకుమార్ ఇందుకు ఎవ్వరిని బాధ్యులను చేయడంలేదని ప్రకటించడం హాస్యస్పదమన్నారు. గేట్‌ల మరమ్మత్తులు వాటిని నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. దీంతోపాటు అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ పై కూడా దృష్టి పెట్టకపోవడం ఒక కారణమన్నారు. ఇందుకు బాధ్యత వహించి మంత్రి తాను పదవి నుంచి తప్పుకోవాలన్నారు. క్రస్ట్‌గేట్ మరమ్మత్తు పేరుతో ఇప్పటికే డ్యాంలో నిల్వ ఉన్న 60 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో రూ.50 వేల ఎకరాలకు పైగా పంట ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ క్రమంలో వేల ఎకరాల్లో సాగు చేసిన పంట నష్టానికి గురికాగా ఆ నష్టం వేల కోట్లల్లోనే ఉంటుందని దీనికి ఎవ్వరు బాధ్యత వహిస్తారని చామరస మాలిపాటిల్ ప్రశ్నించారు. ఈ విషయంలో మంత్రి తాను పదవి నుంచి తప్పుకోవడమేగాక ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించాలన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని డీకే శివకుమార్‌ను తప్పించాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్


పేకాట స్థావరం పై దాడి.. 12 మంది పై కేసు నమోదు

రాయచూరు, ఆగస్టు 13 : దేవదుర్గ తాలూకా జానమరడి గ్రామంలో పేకాట స్థావరం పై పోలీసులు మంగళవారం ఆకస్మికంగా దాడి చేశారు. దాడి సమయంలో పేకాటాడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. జానమరడి గ్రామంలో పెద్ద ఎత్తున పేకాట సాగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఎస్పీ కార్యాలయం సిబ్బందితో సహ జాలహళ్ళి పోలీస్ స్టేషన్ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. కాగా పోలీసుల రాకను గమనించిన కొంతమంది పేకాటలో ఉన్న వ్యక్తులు అక్కడి నుంచి తమ బైకులను అక్కడే వదిలి పరారయ్యారు. దీంతో 43 బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని జాలహళ్ళి పోలీస్ స్టేషన్‌కుతరలించారు. స్వాధీనం చేసుకున్న బైకుల్లో అనేక వాటికి భీమా(ఇన్సూరెన్స్) కంతులు చెల్లించలేదని వెంటనే వాటి యజమానులను రప్పించి తొలుత భీమా కంతు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. సంఘటనకు సంబంధించి జాలహళ్ళి స్టేషన్‌లో ఈ మేరకు కేసు నమోదు చేసి రూ.1.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

యోగిరాజ్ వేదాత్రి మహర్షి (జయంతి)



యోగిరాజ్ వేదాత్రి మహర్షి 1911 ఆగస్టు 14న తమిళనాడు రాష్ట్రం చెంగల్పట్టు జిల్లా గుడువాంచేరిలో జన్మించారు. ఆధ్యాత్మికవేత్త. ప్రపంచ శాంతికి 14 సూత్రాలు ప్రతిపాదించారు. చెన్నైలోని వరల్డ్ కమ్యూనిటీ సెంటర్ వ్యవస్థాపకుడు. తత్వవేత్త, సైంటిస్టు, అయుర్వేదిక్, హోమియోపతిక్ వైద్యులు. 300కు పైగా యోగా కేంద్రాలు స్థాపించి, 80 పుస్తకాలు రాశారు. కుండలిని యోగా, వ్యాయామం, కాయకల్ప యోగాలను విస్తృతం చేశారు. మానవత్వంతో ముందుకు సాగాలని ఆచరించి చూపారు. ప్రపంచ శాంతికోసం ఐక్య రాజ్యసమితి సదస్సులో 14 సూత్రాలను ప్రతిపాదించారు. కుండలిని యోగాపై ప్రసంగించారు. ద్రావిడ వర్సిటీచే 19వ శతాబ్దపు సిద్ధగా గుర్తింపు పొందారు. 2006 మార్చి 28న కన్నుమూశారు.

రెనె గాసిన్ని (జయంతి)



ఫ్రెంచ్ దేశపు రచయిత, సంపాదకులు రెనె గాసిన్ని 1926 ఆగస్టు 14న జన్మించారు. ఏస్టరిక్స్ కామిక్ బుక్ సిరీస్‌ను ఇల్లుస్ట్రేటర్ అల్బెర్ట్ అండర్ జోతో కలసి రూపొందించారు. 1959లో ఫ్రాన్స్- బెల్జియన్ కామిక్స్ మ్యాగజైన్ 'పిలోటె' ను ప్రారంభించారు. పలువురు రచయితలను పరిచయం చేశారు. 1977 నవంబరు 5న కన్నుమూశారు. 2010 ఆయన కాంస్య విగ్రహం పారిస్‌లో ఏర్పాటు చేశారు. కామిక్ పుస్తక రచయితకు దక్కిన తొలి గౌరవంగా చెప్పవచ్చు.

విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ (వర్ధంతి)



విలాస్‌రావ్ దగడోజీరావ్ దేశ్‌ముఖ్ 1945 మే 26న మహారాష్ట్రలోని లాథూర్ జిల్లా బభల్‌గావ్ ప్రాంతంలో జన్మించారు. మహారాష్ట్రకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా 1999-2003 వరకు, 2004-2008వరకు కొనసాగారు. రాజ్యసభ సభ్యుడిగాను, కేంద్రంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్, ఎంఎస్ఎంఈ, పంచాయతీరాజ్, రూరల్ డెవలెప్‌మెంట్, భారీ పరిశ్రమల శాఖ కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. రాజకీయాల్లోకి రాకమునుపు లా ప్రాక్టీస్ చేశారు. ట్రస్టు ఏర్పాటు చేసి పలు కళాశాలలను స్థాపించారు. కాగా ఆయన కుమారులలో ఒకరైన రితీశ్ దేశ్‌ముఖ్ నటుడిగా రాణిస్తున్నారు. 2012 ఆగస్టు 14న విలాస్‌రావ్ కన్నుమూశారు.

జానీ లీవర్ (పుట్టినరోజు)



జానీ లీవర్ 1957 ఆగస్టు 14న ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించారు. అసలు పేరు జాన్ ప్రకాశ్‌రావు జనుమల. తండ్రి హిందూస్థాన్ లీవర్ ఉద్యోగి కావడంతో జానీ లీవర్‌గా గుర్తింపు పొందారు. హిందీ సినీ రంగంలో పేరొందిన కమెడియన్. బాలీవుడ్‌లో 300కుపైగా సినిమాలలో నటించారు. దీవానా మస్తానా (1997), దుల్హే రాజా (1998) సినిమాలకు ఉత్తమ కమెడియన్ పురస్కారం అందుకున్నారు. 13 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. ముంబైలో మిమిక్రీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఉత్సాహంగా పరేడ్ రిహార్సల్స్



స్తంభంపై ఓ సాహస విన్యాసం ఇలా...



శ్వానదళం రిహార్సల్స్..



మిలిటరీ జవాన్ల కవాతు



బైకర్స్ విన్యాసం ఇలా...

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కబ్బన్‌పార్క్ పరిధిలోని ఫీల్డ్ మార్షల్ మాణెక్ షా పరేడ్ మైదానంలో రిహార్సల్స్ సాగాయి. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, జిల్లా అధికారి కేఏ దయానంద్, నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్‌లు మంగళవారం పర్యవేక్షించారు. పరేడ్‌లో వివిధ డివిజన్‌లకు చెందిన విద్యార్థినులు, ప్రత్యేక పోలీసు బలగాలు, మిలిటరీ విభాగాలకు చెందిన ప్లటూన్‌లు రిహార్సల్స్ కవాతు జరిపారు. డాగ్ స్క్వాడ్, మహిళా పోలీసుల విభాగంతోపాటు పరేడ్‌లో పాల్గొనే అందరూ రిహార్సల్స్‌లో భాగస్వామ్యులయ్యారు. ఉత్సవాల్లో పాల్గొనేవారు సిగరెట్, అగ్గిపెట్టెలు, కరపత్రాలతోపాటు నిషేధించబడిన వస్తువులు తీసుకురాకూడదని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. రిహార్సల్స్ ఉత్సాహభరితంగా సాగాయి. మరోవైపు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విధానసౌధ సహా చుట్టుపక్కల ప్రాంతాలలో జెండాల విక్రయం జోరుగా సాగింది.



గోవా పోలీసు బలగాల కవాతు



గౌరవవందనం స్వీకరిస్తున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్



మిలిటరీ స్కూల్ విద్యార్థుల కవాతు



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

చాముండేశ్వరి ఆలయానికి కార్పొరేషన్ అవసరం లేదు

- మైసూరు ఎంపీ యదువీర్
- చాముండేశ్వరి ఆలయం మాదే

- రాజమాత ప్రమోదాదేవి



ఎంపీ యదువీర్

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నాడదేవత చాముం డి దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ అవసరం లేదని మైసూరు ఎంపీ, యువరాజు యదువీర్ మంగళ వారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆలయాలను తమ నియంత్రణలోకి తీసుకోవాలనే ఆలోచన సరి కాదన్నారు. రాజవంశపు హక్కులను లాగేసుకుని ప్రాధికారను ముందుకు తీసుకొచ్చే విధానం సరికాదన్నారు. దేవాలయాలకు వచ్చే ఆదాయంతోనే అభివృద్ధి చేసుకోవచ్చు అన్నారు. దేవాలయాలు, ఆధ్యాత్మిక విషయాల్లో ప్రభుత్వ పాత్ర ఉండదని, ఆలయాలను స్వతంత్రంగా సాగేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని ఇది నా వ్యక్తిగత అభిప్రాయమన్నారు.

చాముండి కొండల ఆస్తులు రాజవంశీయులవే

నాడదేవత చాముండేశ్వరి కొండకు సంబంధించిన వివాదం హైకోర్టులో ఇంకా విచారణదశలో ఉండగానే ప్రభుత్వం ప్రాధికార ఏర్పాటు చేయడం సరికాదని రాజమాత ప్రమోదాదేవి అభ్యంతరం తెలిపారు. మైసూరు ప్యాలెస్ ప్రాంగణంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ చాముండేశ్వరి ఆలయం రాజవంశానికి చెందినదన్నారు. అయినా ప్రభుత్వం చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికారకు మార్చి 7న గెజిట్ విడుదల చేయడం ద్వారా రాజ కుటుంబానికి ఉండే గౌరవానికి భంగం కలిగించడమే అన్నారు. జూలై 19న హైకోర్టులో రిట్ దాఖలు చేశామని, చాముండి ప్రాధికార ఏర్పాటుకు స్టే ఇచ్చిందన్నారు. తద్వారా ప్రాధికార అస్థిత్వాన్ని కోల్పోయిందన్నారు. చాముండి కొండల్లోని చాముండేశ్వరి ఆలయంతోపాటు ఇతర ఆలయాలు, ఆస్తులు మైసూరు రాజ వంశానికి చెందినవన్నారు. 2001లో శ్రీకంఠదత్త నరసింహరాజ ఒడెయార్ కోర్టులో పిటీషన్ వేశారని ఇంకా విచారణ దశలో ఉందన్నారు. ఈలోగానే ప్రభుత్వం ప్రాధికార ఏర్పాటు ద్వారా ఆలయాన్ని తన పరిధిలోకి తెచ్చుకునేందుకు కుట్ర పన్నిందన్నారు. 1971లో రాజ్యాంగానికి 26వ సవరణలో రాజకుటుంబాలకు చెందిన ఆస్తులను ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశించిందన్నారు. అందుకు అనుగుణంగా చాముండి కొండలలోని ఆలయంతోపాటు ఇతర ఆస్తులు తమకు చెందినవిగా జాబితా చేశారన్నారు. 1972లో అప్పటి ముఖ్యకార్యదర్శి ఇది ప్రభుత్వ ఆస్తి కాదని ప్రతిపాదించారన్నారు. స్వాతంత్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు అన్ని ప్రభుత్వాలు తమను ఏదో విధంగా ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. మేం ఎన్నిసార్లు కోర్టులలో విజయం సాధించినా వాటిని అమలు చేయడం లేదన్నారు. మాకు జరిగిన నష్టాన్ని పూడ్చేవారు ఎవరన్నారు. రాజకీయ నాయకులైతే పరిహారంగా భూమికి బదులుగా భూమి, కట్టడాలకు బదులుగా నివాసాలు కేటాయిస్తారని, అయితే దేశపౌరులై ఉండి మాకు ఎందుకు వర్తించదన్నారు. నా భర్త శ్రీకంఠదత్త నరసింహరాజ్ ఒడెయార్ నాలుగుసార్లు ఎంపీ అయినా అధికార దుర్వినియోగానికి పాల్పడలేదన్నారు. ప్రస్తుతం నా కుమారుడు యదువీర్ ప్రజాసేవకోసం ఎంపీ అయ్యారన్నారు. అతడి ప్రభావంతో మా పనులు చేసుకోవాలని భావించడం లేదన్నారు. ప్యాలెస్ విషయం ప్రైవేట్ అంశమని, న్యాయబద్ధంగానే పరిష్కారం చేసుకుంటామన్నారు. అయితే గతంలో శ్రీకంఠదత్త ఒడెయార్ చాముండి కొండలను పర్యవేక్షించుకోలేమని ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. అయితే అది యాజమాన్యపు హక్కులు కల్పించినట్టు కాదన్నారు. అప్పటి పరిస్థితి వేరు, ప్రస్తుత పరిస్థితులు భిన్నమన్నారు. కోర్టు తీర్పు వస్తే చాముండేశ్వరి కొండతోపాటు ఆలయ పర్యవేక్షణకు సిద్ధమన్నారు. చాముండి కొండలు కేవలం కొండలుగా భావించారని, కొన్ని విధివిధానాలు ఉన్నాయని రాజవంశం వాటిని తు.చ పాటిస్తుందన్నారు. ప్రస్తుతం కొందరు విధివిధానాలు పాటించకపోవడం మాకు అసంతృప్తిగా ఉందన్నారు. ఇదే విషయమై సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ చాముండి కొండలకు ప్రాధికార ఏర్పాటుపై రాజమాత ప్రమోదాదేవి కోర్టులో స్టే తెచ్చారని, న్యాయనిపుణులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



మైసూరు రాజమాత ప్రమోదాదేవి

ఢిల్లీ వేడుకలకు పెరువాయి సర్పంచ్ నఫీసా



గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నఫీసా

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా పెరువాయి గ్రామ పంచాయతీ సర్పంచ్ నఫీసాను ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానించారు. ప్రత్యేక అతిథిగా నఫీసా పాల్గొననున్నారు. పెరువాయి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా నఫీసా ఏడాదిగా కొనసాగుతున్నారు. గతంలో రెండున్నరేళ్లపాటు ఉపాధ్యక్షురాలిగా వ్యవహరించారు. గ్రామంలో చెత్త నిర్వహణతోపాటు పలు సామాజిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆమె సేవలను గుర్తించి వరల్డ్ యూత్ స్కిల్‌డేలో భాగంగా ఏడాదిక్రితం సీఎం బసవరాజ్‌బొమ్మై ఆమెను సన్మానించారు. రాష్ట్రం నుంచి ఆరుగురు మహిళా సర్పంచ్‌లను ఢిల్లీలో ఇండిపెండెన్స్ వేడుకలకు ఆహ్వానించారు.

ఉయ్ వైశ్య ఆధ్వర్యంలో మెగా ఫ్లాగథాన్

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఉయ్ వైశ్య సంస్థ ఆధ్వర్యంలో మెగా ఫ్లాగథాన్‌ను నిర్వహిస్తున్నట్టు ఫౌండర్ అనిల్‌గుప్త తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 7.30 గంటలకు రామకృష్ణ ఆశ్రమ సర్కిల్‌లోని ఉయ్ వైశ్య గ్లోబల్ ఆఫీస్ వద్ద ప్రారంభమవుతుందన్నారు. 78 మీటర్ల పొడవైన జాతీయ జెండాను 3 కిలోమీటర్ల మేర ఊరేగిస్తామన్నారు. కార్య క్రమంలో పాల్గొనేవారు ముందుగా రిజిస్టర్ చేసుకోవా లని, ఆరెంజ్, బ్లూ, గ్రీన్, వైట్ దుస్తులు ధరించాలన్నారు.

సందడిగా ఎలక్ట్రానిక్స్ ఫెస్ట్

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఫీనిక్స్ మాల్‌లో ఎలక్ట్రానిక్స్ ఫెస్ట్ సందడిగా సాగుతోంది. మహదేవపురలోని మాల్‌లో రిలయెన్స్ డిజిటల్, క్రోమా, డైసన్, హెచ్‌పి, శ్యాంసంగ్, లెనోవో, ఒప్పోతోపాటు అన్ని ప్రముఖ బ్రాండ్‌ల ఎలక్ట్రానిక్స్ వస్తువులు రాయితీధరలతో లభిస్తున్నాయన్నారు. టివి, రిఫ్రిజిరేటర్, మొబైల్స్‌తోపాటు అన్ని విధాలా వస్తువులు లభిస్తాయని, లక్కీ డ్రా సదుపాయం కల్పించారు. ఈనెల 19వరకు ఫెస్ట్ కొనసాగుతుందని ఫీనిక్స్ మాల్ నిర్వాహకులు ప్రకటించారు.

ఇండియా ఫస్ట్ లైఫ్‌తో న్యాబ్‌ఫిన్స్ ఒప్పందం

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ జీవితబీమా సంస్థలలో ఒకటైన ఇండియా ఫస్ట్‌లైఫ్ సంస్థ నబార్డ్ అనుబంధ సంస్థ న్యాబ్‌ఫిన్స్‌తో ఒప్పందం చేసుకుంది. సామూహికంగా బీమా సౌలభ్యం కల్పించేందుకు, సలహాలు, గ్రూప్ క్రెడిట్ లైఫ్ మ్యాక్రో ఇన్సూరెన్స్ కవరేజ్‌కు వీలు కానుంది, ఇండియా ఫస్ట్ సీఈఓ రుషబ్‌గాంధీ అభిప్రాయం మేరకు గ్రామీణాభివృద్ధికి కట్టుబడిన, ప్రతిష్టాత్మకమైన ఎన్‌బీఎఫ్‌సితో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. మూడేళ్లపాటు కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందంతో ఇండియాఫస్ట్ లైఫ్ ద్వారా గ్రామీణ, పట్టణ, మినీ నగరాల పరిధిలో వ్యాపార విస్తరణ, బీమా సేవలు కొనసాగించదలిచామన్నారు.

పాత్రికేయుల్లో బాధ్యత పెరగాలి



వివిధ రంగాల సాధకులకు సన్మానం

శిడ్లఘట్ట, ఆగస్టు 13: సమాజంలోని లోటుపాట్లను దిద్దే పాత్రికేయులలో గ్రూపులు తగవని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. పత్రికా దినోత్సవాన్ని వీరణ్ణ కెంపణ్ణ కల్యాణమండపంలో ఏర్పాటైన కార్యక్రమంలో పాల్గొని నాల్గో స్తంభంగా ఉన్న మీడియా రంగంలో పాత్రికేయులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను చేపట్టిన కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజలకు చేర్చాలని కోరారు. పత్రికలు వాస్త వాలను తెలియచేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాయన్నారు. పార్టీ లకు అతీతంగా అందరికీ న్యాయం అందేలా చూడాలని అభిప్రాయ పడ్డారు. కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ రాజీవ్‌గౌడ మాట్లాడుతూ కొవిడ్‌వేళ చేపట్టిన సమాజసేవ కార్యక్రమాలకు మీడియా ద్వారా గుర్తింపు దక్కిందన్నారు. ఇదే సందర్భంగా ప్రతిభా పురస్కారాలు, సాధకులకు సన్మానం, మహిళా రైతులకు సన్మానం, స్వసహాయసంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, మేళా, పాత్రికేయులకు ఆరోగ్యబీమా కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. సమావేశంలో విజయపురశాఖ బసవకల్యాణమఠం మాదేవస్వామి హిత వచనాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, బీజేపీ హోబళి అధ్యక్షుడు సీకల్ ఆనందేగౌడ, రైతుసంఘం నాయకుడు కెంపణ్ణ, ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, కేఎంఎఫ్ డైరెక్టర్ బంకమునియప్ప, కార్యనిరత పాత్రికేయుల సంఘం ఉపాధ్యక్షుడు శశికుమార్, ప్రధాన కార్యదర్శి ఛాయ రమేశ్, సంఘం మాజీ అధ్యక్షులు మునేగౌడ, కే నాగరాజు, జగదీశ్‌బాబు, కరగప్ప తదితరులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' అందరి వేడుక



హర్‌ఘర్ తిరంగాలో విజయేంద్ర తదితరులు

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా అందరి వేడుక అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర వెల్లడించారు. మంగళ వారం నగరంలోని వసంతనగర్‌లో హర్ ఘర్ తిరంగా అభియానకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వి జయేంద్ర మాట్లాడుతూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అర్థవంతంగా జరుపుకోవాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు ఇచ్చారన్నారు. యువతకు స్వాతంత్ర్య సంగ్రామ కాల ఘట్టాలను వివరించాలన్నారు. త్యాగం, బలిదానంపై చర్చ జరగాలన్నారు. దేశభక్తి చైతన్యం కోసం అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 15వరకు స్వాతంత్ర్యపోరాట వీరుల స్మారకాలు, విగ్రహాలను శుభ్రం చేసే ప్రక్రియ కొన సాగిస్తామన్నారు. బుధవారం దేశ విభజన, బ్లాక్‌డేను గుర్తుంచుకుని స్మృతి దివస్ ను ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలందరినీ కలుపుకుని పని చేయాలని సూచించారు. ఎంపీ పీసీ మోహన్, బీజేపీ బెంగళూరు సెంట్రల్ అధ్య క్షుడు సప్తగిరిగౌడ, పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఈఎస్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రారంభం

- మూడు కంపెనీలతో ఒప్పందం



ఒప్పందంలో సూర్యప్రసాద్, ఏస్ డిజైనర్స్ ఎండీ టీకే రమేశ్

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీ ఉద్యోగులలో నైపుణ్యత పెంచేదిశగా ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సును లాంచనంగా ప్రారంభించారు. ఈమేరకు ఏస్ డిజైనర్స్ లిమిటెడ్, మైక్రోమ్యాటిక్ మెకానిక్ టూల్స్ లిమిటెడ్ (ఎంఎంటీఎల్), యుకెన్ ఇండియా లిమిటెడ్ సంస్థలతో ఒప్పందం కుదిరింది. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్, ఏస్ డిజైనర్స్ లిమిటెడ్ ఎండీ, ఎంఎంటీఎల్ డైరెక్టర్ టీకే రమేశ్, యుకెన్ ఇండియా గ్రూప్ సీఎఫ్ఓ నరసింగరావ్‌ల మధ్య ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు వీసీ సూర్యప్రసాద్ మాట్లాడుతూ వివిధ వృత్తులలో స్థిరపడినవారు ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సు చేయాలనే కలను సాకారం చేయడమే మా ఆశయమన్నారు.

ప్రజల సమస్యలు ఆలకించిన ఎమ్మెల్యే

బాగేపల్లి, ఆగస్టు 13: ప్రజల అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. తాలూకాలోని తోళ్ళపల్లిలో మంగళవారం ఏర్పాటైన జనస్పందనలో ప్రజల సమస్యలను ఆలకించారు. జిల్లా, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వందకుపైగా అర్జీలు వచ్చాయి. తాగునీరు, రోడ్డు, ఇంటిస్థలం, రేషన్‌కార్డు, బస్సు సర్వీసులు, గృహలక్ష్మి, అన్నభాగ్య, తదితర సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఇదే సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలో పలువురు రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ ఉపకరణాలు అందజేశారు. తోళ్ళపల్లి గ్రామ కాలనీలో సుమారు 12 లక్షల రూపాయలతో నిర్మించదలిచిన అంబేడ్కర్ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం పెద్దరెడ్డిపల్లిలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనిషా మహేశ్ ఎస్ పత్రి, ఈఓ రమేశ్, బీఈఓ వెంకటేశప్ప, సీడీపీఓ రామచంద్ర, తాలూకా ఆరోగ్యాధికారి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనస్పందనలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

నేషనల్ స్టెమ్ చాలెంజ్ పోటీల్లో పవిత్ర, భువన్‌కు ర్యాంకు

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు జాతీయస్థాయి స్టెమ్ చాలెంజ్ పోటీల్లో చంద్రానగర్ విద్యార్థినులు పవిత్ర, భువన్‌లు విజేతలుగా నిలిచారు. క్లస్టర్‌ల స్థాయిలో పోటీలు జరిగాయి. బ్రిలియో సహకారంతో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సర్వీసెస్ కంపెనీ పోటీలను నిర్వహించింది. కుమారస్వామి లే అవుట్ పాఠశాలలో జరిపిన పోటీల్లో జోనల్ రౌండ్‌లో విజేతలుగా పవిత్ర, భువన్‌లు నిలిచారు. ఈనెల 27న గ్రాండ్ ఫినాలె పోటీలు ఉంటాయన్నారు.



రాణించిన విద్యార్థులు

రాజకాలువ ఆక్రమణల ప్రభావం... ఎటు చూసినా నీరే



రాజీవ్ నగర్ లే అవుట్‌లో ఇలా..

చింతామణి, ఆగస్టు 13: పట్టణ, తాలూకా వ్యాప్తంగా వర్షం జోరు సాగింది. సోమ, మంగళవారాలలో వర్షం కురిసింది. కాగా రాజకాలువ ఆక్రమణలకు గురి కావడంతో నీరు సజావుగా ప్రవహించక రోడ్లు, ఇళ్ల చుట్టుపక్కల ఖాళీ స్థలాల్లో చేరింది. రాజీవ్‌నగర్ లే అవుట్‌లోని ఏఎస్ఐ దస్తగిర్ ఇంటి చుట్టు పక్కల ఎటు చూసినా నీరే కనిపించింది. నగరసభ కమిషనర్ చలపతి దృష్టికి సమస్య తేవడంతో స్పందించారు. నిల్వ అయిన నీరు సజావుగా వెళ్లేలా కాలువలలో పూడికలు తొలగించారు. సోమ వారం రాత్రి ప్రారంభమైన వర్షం మంగళవారం తెల్లవారుజాము వరకు వర్షం కురవడంతో రాజీవ్ నగర్, అంజని లే అవుట్, కిశోర విద్యాభవన ముందుభాగం, ఎంజీ రోడ్డు, బంబూబజార్ మలుపు తదితర ప్రాంతాలు జలమయం అయ్యా యి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.



బంబూబజార్ మలుపు వద్ద ఇలా...